నత్తకు నేర్పిన నడకలివి!

- పురోగతిలేని ఎన్‌ఏడీ ఆర్‌వోబీ పనులు
- వీఎంఆర్‌డీఏ కమిషనర్ హెచ్చరించినా ఫలితం శూన్యం
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌పై తరచూ ప్రమాదాలు
- అయినా పట్టించుకోని అధికారులు



గాజువాక నుంచి ఫ్లైఓవర్ కిందకు వచ్చేమార్గంలో అడ్డదిడ్డంగా భారీ కేడ్లు



ప్రమాదకరంగా ఉన్న ప్రదేశం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ వద్ద చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా గాజువాక వైపు ఆర్‌వోబీ నిర్మాణం సకాలంలో పూర్తి కాకపోవటంతో ఆ దారిలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రహదారి ఇరుకుగా ఉన్నందున హైవేపై భారీ వాహనాల రాకపోకల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.28 కోట్లు కేటాయించారు. మూడేళ్ల క్రితం చేపట్టిన పనులు ఇప్పటికీ కొనసా...గుతూనే ఉన్నాయి.

కమిషనర్ ఆదేశాలూ బేఖాతరు

ఇటీవల వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఈ పనులను పరిశీలించారు. పనుల్లో మరింత వేగం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అధికారులు మాత్రం ఇవన్నీ తమకు మామూలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కమిషనర్ ఆదేశాలను సీరియస్‌గా తీసుకున్న దాఖలాల్లేవు. పిల్లర్లు రోడ్డుకు సమాంతరంగా పూర్తి చేసినా, ఇరువైపులా రహదారిని అనుసంధానం చేసే పనులు మాత్రం అతీగతీ లేకుండా ఉన్నాయి. ఇప్పట్లో పనులు పూర్తయి ఆర్‌వోబీ అందుబాటులోకి వస్తుందన్న నమ్మకాలు తమకు కలగట్లేదని ఈ ప్రాంతవాసులు అంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టని వైనం

ఎన్‌ఏడీ వద్ద హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌వోబీ నిర్మాణ పనుల కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతుండటం, వాటికి అవసరమైన సామాగ్రి పెడుతున్నారు. దీంతో గాజువాక నుంచి వచ్చే భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఫ్లై ఓవర్ కింది నుంచి గాజువాక వైపు వెళ్లే వాహనదారులకు సైతం ఇబ్బందికరంగా మారింది. ఆర్‌వోబీ పనులు చేపట్టే మూల మలుపు వద్ద ఎటువంటి హెచ్చరికల బోర్డులు లేకపోవటంతో వాహనదారులు తికమకపడుతున్నారు. ఇక్కడ మలుపుతిప్పే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించే పరిస్థితి లేదు. ఈ కారణంగానే ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. అయినప్పటికీ వీఎంఆర్‌డీఏ అధికారులు పట్టించుకోకపోవటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



హెచ్చరికల బోర్డులు లేకపోవటంతో దూసుకొస్తున్న వాహనాలు

ఇంకెన్నేళ్లు సాగదీస్తారో!

ఎన్‌ఏడీ వద్ద ఆర్‌వోబీ నిర్మాణ పనులు ఈ డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ ఇక్కడ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. గడువులోగా పనులు పూర్తి కావటం అసాధ్యమని ఈ ప్రాంత వాసులు అంటున్నారు. గాజువాక నుంచి వచ్చే ద్విచక్ర వాహనదారులు ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ కింద మార్గానికి వచ్చే క్రమంలో ఆర్‌వోబీ పనులు జరిగే చోట తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పై మార్గం నుంచి కిందికి వచ్చే మలుపు రహదారి గుంతలమయంగా ఉంది. అధికారులు స్పందించి ఇలాంటి సమస్యలపై దృష్టి సారించి, వాహనాల రాకపోకలకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఆర్‌వోబీ నిర్మాణం సకాలంలో పూర్తి చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని వేడుకుంటున్నారు.

పూడికలు తరలించారు!



రామ్మూర్తిపంతులపేట రహదారిపై వదిలేసిన పూడికల్ని పొక్లెయిన్‌తో తరలిస్తున్న సిబ్బంది



వ్యర్థాలు తొలగించిన అనంతరం గవర కంచర పాలెం ప్రధాన రహదారి

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం ప్రాంతాల్లో గెడ్డల నుంచి తొలగించిన పూడికలను ఎట్టకేలకు తరలించారు. గత నెలలో తొలగించిన పూడికను గెడ్డలకు ఇరువైపులా పోగేశారు. రోజులు గడుస్తున్నా.. దాన్ని తరలించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన దుస్థితి. దీనిపై ఆదివారం 'సాక్షి'లో 'పూడిక తీసి...వదిలేస్తున్నారంతే...!'శీర్షిక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశాల మేరకు పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ పర్యవేక్షణలో వార్డు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదారి నళిని నేతృత్వంలో పొక్లెయిన్ సాయంతో పూడికలను వాహనల్లోకి వెత్తి, తరలించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

'కళింగ వైశ్యులకు అండగా నిలుద్దాం'



మాట్లాడుతున్న గోవిందరాజులు

విశాఖ విద్య: కళింగ వైశ్యులకు అండగా నిలిచేలా సంఘం ద్వారా కార్యాచరణ సిద్ధం చేశామని రాష్ట్ర కళింగ కోమటి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు అన్నారు. కళింగ వైశ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కొత్తపాలెంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో బీసీ–డి కుల మెర్జింగ్ సాధించామని, ఇప్పుడు ఓబీసీ రిజర్వేషన్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయిలో సంఘాలు బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్, పేదలకు ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో 91వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సత్తిరాజు, కళింగ వైశ్య అసోసియేషన్ కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, కోశాధికారి పట్నాన సాయికిరణ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పెంటా చంద్రభూషణరావు, సంఘ అధ్యక్షుడు మధుసూదనరావు, కార్యదర్శి దామోదరరావు, కోశాధికారి మిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులతో భవనం వద్ద మొక్కలు నాటించారు.

భౌగోళిక విజ్ఞానం అవసరం



సదస్సులో మాట్లాడుతున్న గురుకుల డీసీవో రూపావతి

మధురవాడ: భౌగోళిక విజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, ముఖ్యంగా ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాల్సి అవసరం ఉందని గురుకుల డీసీవో రూపావతి చెప్పారు. మధురవాడ సమీపంలోని కొమ్మాది రిక్షా కాలనీలోని ఆంధ్ర ప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో ఆదివారం భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకుని సెమినార్ నిర్వహించారు. విశాఖ చాప్టర్ ఐజీఎస్ చైర్మన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ భౌగోళిక విశ్లేషణ, శాస్త్రీయ విచారణ, కొత్త అధ్యయనాల ద్వారా చరిత్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డి.శాంతకుమారి, ఐజీఎస్ సభ్యురాలు ప్రొఫెసర్ బి.హేమమాలిని, సెక్రటరీ వజీర్ మహమ్మద్, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ బి.మంగళమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సండే స్కూల్ విద్యార్థుల ఆరాధన



సండే స్కూల్ విద్యార్థులతో చర్చి నిర్వాహకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లోని సేవియర్ లూథరన్ చర్చ్‌లో సండే స్కూల్ పిల్లలు ప్రత్యేక ఆదివారం ఆరాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ జాకబ్‌రాజ్ స్తుతులు, స్తోత్రాలు వినిపించారు. చిన్నారులను తీర్చిదిద్దుతున్న సండే స్కూల్ టీచర్లను అభినందించారు. సండే స్కూల్ టీచర్లు కె.ప్రియాంక, సీహెచ్ మనీషా, ట్రెజరర్ నేతల శేఖర్, పీసీసీ మెంబర్స్ కె.జాన్ సుధాకర్, పొట్టి రాజ్‌కుమార్, కుండా విజయ్‌కుమార్, జి.షాలెంరాజు, కోనాల కరుణ్‌కుమార్, యూత్ సభ్యులు, స్త్రీల సమాజం, సంఘ సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా జైదుర్గ ఆలయ వార్షికోత్సవం



భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డిస్తున్న కార్పొరేటర్ పీవీ సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ కొండపైనున్న జైదుర్గ ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక కార్పొరేటర్ పి.వి.సురేష్ అమ్మవారిని దర్శించుకుని, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


కవులకు సత్కారం



సత్కారం పొందిన కవులతో గ్రంథాలయ అధికారి, అతిథులు

మల్కాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో పలువురు కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు. ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయుడు సుంకర చలపతిరావు కాలం–ఖర్మం కవితను, మరో కవి విశ్వనాథ్‌రాజు తెలుగు భాష ఔన్నత్యంపై, మిగిలిన కవులు కూడా పలు అంశాలపై కవితలను వినిపించి ఆహూతుల్ని అలరించారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, టీడీపీ నాయకులు కాకి పొలిరెడ్డి తదితరులు కవులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతోపాటు మొక్కల్ని అందించి, సత్కరించారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిరామ్

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ సంకురపేట పైడిమాంబ ఆలయం వద్ద కేఎస్ఆర్ వైద్యశాల డాక్టర్ సాయిరామ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో సంకురపేట గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెగా డ్యాన్స్ షో



ఆకట్టుకున్న కృష్ణుడు, గోపికల నృత్య ప్రదర్శన

మల్కాపురం: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరచుకోవాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళ కళాశాలలో నిర్వహించిన మెగా డ్యాన్స్ షోను ప్రారంభించి, మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నిధులు సేకరించి వాటిని నిరుపేదల కోసం వెచ్చించాలన్న యాజమాన్యం ఆలోచనను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన విద్యార్థులు చేసిన 27 సంప్రదాయక నృత్య ప్రదర్శనలు అలరించాయి. నృత్య ప్రదర్శనలతో ప్రతిభ చూపిన విద్యార్థులను అతిథుల చేతుల మీదుగా బహుమతులందించి, అభినందించారు. కార్యక్రమానికి ప్రముఖ కొరియోగ్రాఫర్ మీనా, నాట్య విభాగ ఆచార్యులు డాక్టర్ కె.వి.విజయవేణిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. వార్డులోని పుర వీధుల్లో అమ్మవారి సారెను ఊరేగించి, నివేదించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు. 0వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బుద్దా శివాజీ, శరగడం గంగరాజు, ఆడారి మహేష్, రాపేటి రమణ, శరగడం నాగేష్, ఎల్లపు గోవింద, భవానీ భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ అసెంబ్లీ క్రియాశీల, శక్తి కేంద్రాల సమావేశం



నియోజకవర్గ క్రియాశీల, శక్తి కేంద్రాల సభ్యులతో బీజేపీ నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో ఆదివానం బీజేపీ పశ్చిమ అసెంబ్లీ క్రియాశీల, శక్తి కేంద్రాల సమావేశం జరిగింది. బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, విశాఖ జిల్లా సంఘటన పర్వ అధికారి పూడి తిరుపతిరావు హాజరై పార్టీ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, సభ్యత్వ ఉప ప్రముఖ్ రాయకృష్ణ, మల్కాపురం మండల అధ్యక్షుడు ఎల్లబిల్లి వెంకటరావు, 63వ వార్డు అధ్యక్షుడు రాజారావు, 40వ వార్డు అధ్యక్షుడు అనిల్, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడ్డ, నార సంచులనే వాడండి

అగనంపూడి: ఎకో వైజాగ్‌లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ, నార సంచులనే వినియోగించాలని కోరుతూ తిరుమలనగర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరంధామం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందన్నారు. తడి పొడి చెత్తలను వేరు చేసి కంపోస్టు ఎరువుగా వినియోగించాలని సూచించారు.

ఐఈఈఈ రిసోర్సెస్ వినియోగంపై అవగాహన



సదస్సుకు హాజరైన ఏయూ ఆచార్యులు, విద్యార్థులు



అవగాహన కల్పిస్తున్న ధను పట్టన్‌శెట్టి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వి.ఎస్.కృష్ణా సెంట్రల్ లైబ్రరీలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో 'ఇంపార్టెన్స్ ఆఫ్ ఐఈఈఈ రిసోర్స్ ఇన్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఐఈఈఈ సీనియర్ క్లైంట్ సర్వీసెస్ మేనేజర్ ధను పట్టనొట్టి ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సమావేశ మందిరంలో ఈ అవగాహన సదస్సు జరిగింది. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఐఈఈఈ రిసోర్సెస్ ఎంతగా ఉపయోగపడుతున్నాయో ఆయన వివరించారు. ఐఈఈఈ ద్వారా విస్తృత శ్రేణి జర్నల్స్, వాటి వినియోగం, సమాచారం మార్పిడి, నిపుణుల సలహాలు పొందవచ్చన్నారు. ఏయూ చీఫ్ లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వారోత్సవాల ద్వారా గ్రంథాలయాల విశిష్టతతోపాటు వాటి వినియోగంలోని సాంకేతిక అంశాలపైనా, పుస్తక విజ్ఞానం ఆవశ్యకతపైనా పెద్ద ఎత్తున విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. లైబ్రరీలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షణగిరి యాత్ర



దివ్యబలిపూజ నిర్వహిస్తున్న బిషప్ జయరావు




తేరును మోస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: విశాఖ కథోలిక అగ్రపీఠం, జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్ సంయుక్త నేతృత్వంలో క్రీస్తు రక్షకుని యాత్ర, రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వస్థత ప్రార్థనలు, ఫాదర్ ఇంగ్లిష్‌లో దివ్యబలి పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో రెవరెండ్ ఫాదర్ పొలిమేర జయరావు బైబిల్ సందేశం అందించారు. ప్రపంచానికి ఏసు క్రీస్తు రక్షణ ప్రణాళికలను వివరించారు. సుమారు 50 మంది ఫాదర్లు, 100 మంది మతకన్యలతో కలసి రక్షణగిరి పర్వదిన దివ్య పూజాబలిని సమర్పించారు. సెయింట్ పీటర్స్ హైస్కూల్ ముఖద్వారం వద్ద 'బాలయేసు మండపం–పునీత క్లారమ్మ స్వరూపం'తేరులను ఆర్చిబిషప్ జయరావు ప్రారంభించారు. సహాయ విచారణకర్తలు ఫాదర్ వినయ్‌కుమార్, ఫాదర్ అంథోనిరాజ్, పీపీసీ సభ్యులు రాజేష్‌బాబు, రవీంద్ర, శేషుబాబు, ఆలిండియా క్యాథలిక్ యూనియన్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బరితెగించిన మందుబాబులు

- వైన్ షాపుల వద్దే మద్యం సేవిస్తున్న వైనం
- ఎమ్మెల్యే అనుచరుల షాపులు కావడతో అటువైపు చూడని పోలీసులు



ఎమ్మెల్యే అనుచరుల వైన్‌షాపు కౌంటర్ వద్ద మద్య సేవనం



వైన్‌షాపు ముందే దర్జాగా మద్యం సేవిస్తున్న మందుబాబు



వైన్ షాపు పక్క ఫుట్‌పాత్‌ను బార్‌గా మార్చుకున్న మందుబాబులు

మల్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతుండటంతో మందుబాబులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. వైన్ షాపుల వద్ద, షాపులకు పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లపై మద్యం సేవిస్తూ వీరంగం సృష్టిస్తున్నారు. వైన్ షాపులు టీడీపీ నేతలవి కావడంతో అటువైపు పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. జీవీఎంసీ 61వ వార్డు ప్రధాన సేవా మార్గంలోని మరిడిమాంబ కల్యాణ మండపానికి అతి సమీపంలో ఇటీవల ఓ వైన్ షాపును పశ్చిమ ఎమ్మెల్యే అనుచరులైన టీడీపీ నేతలు ఏర్పాటు చేశారు. కౌంటర్ సేల్స్ పెంచేందుకు మందుబాబులు షాపు వద్దే మద్యం సేవించినా నోరు మెదపడం లేదు. నిజానికి వైన్ షాపు వద్ద మద్యం మాత్రమే కొనుగోలు చేయాలి. బార్‌లో లేదా ఇంటి వద్ద మద్యం సేవించాలి. అందుకు విరుద్ధంగా వైన్‌షాపుల వద్దే కొంత మంది మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. ఫుట్‌పాత్‌లను బార్‌లుగా మార్చుకుంటున్నారు. ప్రధాన సేవా మార్గంలోని నాలుగు వైన్ షాపుల వద్దే ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వైన్ షాపులకు 200 మీటర్ల దూరంలో మల్కాపురం పోలీస్‌స్టేషన్ ఉంది. ప్రతి రోజూ సాయంత్రం సమయంలో పోలీసుల గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ.. వైన్‌షాపుల వద్ద జరుగుతున్న ఈ తంతుపై కన్నెత్తి చూడటం లేదు. మందుబాబుల చేష్టలతో పాదచారులు భయాందోళన చెందుతున్నారు.

2 నుంచి మార్గశిర మాసోత్సవాలు



కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలు డిసెంబర్ 2 నుంచి 30 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మార్గశిర మాసోత్సవాల్లో నిర్వహించే ప్రత్యేక పూజల వివరాలను ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు తెలిపారు. మార్గశిర ప్రతి గురువారం నిర్వహించే పంచామృతాభిషేకంలో పాల్గొన దలచే భక్తులు రూ.7,500, మార్గశిరంలో గురువారం మినహా మిగిలిన రోజుల్లో నిర్వహించే పంచామృతాభిషేకంలో పాల్గొన దలచే భక్తులు రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. అలాగే ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకంలో పాల్గొన దలచే భక్తులు రూ.1,116 చెల్లించాలి. ఆయా పూజల్లో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుం ముందుగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా www.aptemples.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలి. లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, విశాఖపట్నం అకౌంట్ నంబరు 0608 1001 1006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్0806081లో పూజా రుసుం చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామాను endow-eokanaka@gov.in ద్వారా పంపవచ్చు. ఆలయంలో కూడా టికెట్లు పొందవచ్చన్నారు.

స్టోర్స్‌ను లాభాల బాటలో నడిపించండి



సహకార వారోత్సవాల్లో ప్రసంగిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్‌లో ఆదివారం సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా సహకార అధికారి సోమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కోఆపరేటివ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సహకార సంఘాల ప్రాముఖ్యతను వివరించారు. స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్‌ను లాభాల బాటలో నడిపించేలా అందరూ కృషి చేయాలన్నారు. కోఆపరేటివ్ కార్యదర్శి ఆకుల నూకరాజు, డైరెక్టర్ బి.టి. జగదీశ్వరరావు ఉక్కు కోఆపరేటివ్ స్టోర్స్ కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, అప్పారావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.